సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం, 10, మే, 2023



అంతర్ రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్

జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



భర్తను అడ్డు తొలగించుకునే యత్నం

ప్రియుడితో కలిసి ఏకంగా భర్తపైనే హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సిద్దవటం మండలంలో చోటు చేసుకుంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.76	రూ.112
రెండోరకం	రూ.56	రూ.74

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 602 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

తహసీల్దార్ బదిలీ

రామాపురం : రామాపురం మండల తహసీల్దార్ వైఎస్ సత్యానందంను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన తొమ్మిది నెలలు ఇక్కడ పనిచేశారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అరవింద్ కిశోర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు సమాచారం.

డ్రోన్‌లతో ఖర్చు నియంత్రణ

రాయచోటి టౌన్ : పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి కిసాన్ డ్రోన్‌లను ఉపయోగించడం ద్వారా కూలీల ఖర్చును నియంత్రించవచ్చని అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం రాయచోటిలో గరుడ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ కె.శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయసాయ శాఖ అధికారులు, రైతులకు డ్రోన్‌ను ఎలా ఉపయోగించాలనే విషయంపై అవగాహన కల్పించారు.

జిల్లాకు వర్షసూచన

కడప అగ్రికల్చర్: బుధవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు పలు మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్యలు తెలిపారు. 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం పడనుండగా, 14వ తేదీ మాత్రం ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షసూచన ఉందన్నారు.

శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : లోక కల్యాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత 'శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి' జిల్లా వాసులు తరలి రావాలంటూ ప్రభుత్వం పంపిన ఆహ్వాన శుభ పత్రికను మంగళవారం కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టయిశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మహాయజ్ఞాన్ని జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ స్పెషల్ కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి బీ కేటగిరిలో ప్రవేశాలు జరుగుతాయన్నారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసినవారు బధిరుల ప్రత్యేక పాఠశాలలు, సాధారణ పాఠశాలలు, మరియు భవిత కేంద్రాలలో ఉపాధ్యాయులుగా అర్హులన్నారు. వివరాలకు 9966006758, 9849311680 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సర్వీసులు వినియోగించుకోండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేలాంగిణికి నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకో వాలని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు డిపోల నుంచి ఈ నెల 12వ తేదీన వేలాంగిణికి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నామన్నారు. తిరుపతి, తిరుత్తణి, కంచి, నాగపట్నం మీదుగా వేలాంగిణికి చేరుకుంటాయన్నారు. వీటికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. అలాగే ప్రతి సోమవారం నిత్యపూజకోన, పొలతలకు కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు.

కృషితోనే లక్ష్యసాధన



సదస్సులో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కృషితోనే లక్ష్యం సాధించగలమని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 'మను'లో స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ అధ్యక్షతన కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటే సగం విజయం దక్కినట్లే అన్నారు. కార్యక్రమంలో మను ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్, కళాశాల ప్రోగ్రాం అధికారి మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, హెచ్‌ఓడీలు హకీముద్దీన్, విలాయత్ అలీ బేగ్, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

సమస్యలకు మెరుగైన పరిష్కారమే..
జగనన్నకు చెబుదాం

- టోల్‌ఫ్రీ నంబర్ 1902తో సమస్యలకు పరిష్కారం
- తాడేపల్లిలో ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మెరుగైన పరిష్కారం సూచించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ప్రజా వినతులకు మెరుగైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న "జగనన్నకు చెబుదాం" కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. వినతుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్ 1902 కేటాయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, కల్యాణమస్తు, షాదీతోఫా తదితర సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు ఏవైనా వ్యక్తిగత స్థాయిలో సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి విన్నవించుకునే అవకాశం లభించిందన్నారు. అలాగే భూముల మ్యుటేషన్స్, పట్టాదారు పాసుపుస్తకాలు, రేషన్‌కార్డులు, పెన్షన్ కానుక, ఆరోగ్యశ్రీ సేవలు వంటివి పొందాలనుకునే వారు కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు సమర్పించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. కలెక్టేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎస్పీ గంగాధర్‌రావు, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలుచేసి విజయవంతం చేద్దామని కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ గంగాధర్‌రావులు జిల్లా అధికారులతో అన్నారు. ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుంటేనే పాలన కూడా సంతృప్త స్థాయిలో సాగుతుందనే ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడదామన్నారు. సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరిస్తూ అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సైతం ఈ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతులను పారదర్శకంగా, నాణ్యంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. పోలీసు యంత్రాంగాన్ని కూడా ఈ విషయంలో మరింత పటిష్టపరుస్తామని ఎస్పీ చెప్పారు. సచివాలయ స్థాయిలోని మహిళా పోలీసు నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టేందుకు టీములు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

శాంతి, సంక్షేమం,అభివృద్ధి సీఎం లక్ష్యాలు

రాష్ట్రంలో ప్రజలు శాంతితో పాటు సంక్షేమాన్ని పొందాలని అదే స్థాయిలో అభివృద్ధి దిశగా అనుకొన్న లక్ష్యం సాధించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు సైతం ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం లభించిందన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజల సమస్యలకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

సీనియర్ అధికారుల పర్యవేక్షణ

కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని సీనియర్ అధికారులతో పర్యవేక్షణ చేస్తామని జిల్లా కలెక్టర్ అధికారులతో అన్నారు. సీనియర్ అధికారులు నెలకు రెండు పర్యాయాలు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. ప్రజా వినతులు పరిష్కరించేందుకు, నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో, సీఎంఓ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది కనుక అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతమున్న స్పందన కంటే మెరుగ్గా ఈ కార్యక్రమం ద్వారా అర్జీలు పరిష్కారం అవుతాయన్నారు. కాల్స్ స్వీకరణ, ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ సందేశాలు, ఫీడ్ బ్యాక్ వంటివి ఉంటాయని చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ జగనన్నకు చెబుదాం 1902 టోల్‌ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో
ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



కేవీపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

రాయచోటి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా విద్యార్థులను సమాయత్తం చేయాలని ఆయా శాఖల జిల్లా సంక్షేమ అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో 50శాతం మాత్రమే రావడంతో సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, గురుకులాల ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉత్తమ టీచర్లతో స్పెషల్ క్లాసులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకోసం ఎంతో ఖర్చు పెడుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంపై వారిని ప్రశ్నించారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుతున్నారా లేదా గమనించాలని, వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసేందుకు ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. పెనగలూరు, పుల్లంపేట, గాలివీడు, ఓబులవారిపల్లి తదితర మండలాల్లోని కేజీబీవీలు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో జీరో పర్సంటేజ్ రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ మంచి మార్కులు తెచ్చుకునేలా బోధన చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఐఈఓ కృష్ణయ్య, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, గురుకులాలు ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పదోతరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులతో రాణించడపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభినందించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించిన కేవీపల్లి మండలం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించడంతోపాటు భవిష్యత్తులో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. సౌమ్యశ్రీ 586, కె.రెడ్డి భవ్యశ్రీ 571, ఎ.ముని ప్రసన్న 570, కె.రుచితకు 565 మార్కులు రావడంతో ఆ విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కేవీపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యసేవలు



గర్భిణులకు చికిత్స నిర్వహిస్తున్న కొండయ్య

సంబేపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఆరోగ్య కేంద్రాలలో లభ్యమవుతాయని జిల్లా వైద్యాధికారి కొండయ్య అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌పై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గర్భవతులకు ఉచిత పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు ఇస్తామన్నారు.

పాలిసెట్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- మదనపల్లి, రాజంపేట, కలికిరిలో పరీక్షా కేంద్రాలు
- 17 కేంద్రాలలో పరీక్షలు రాయనున్న 4,404 మంది విద్యార్థులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో బుధవారం నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.సుధాకర్ తెలిపారు. జిల్లా పరిధిలో 4,404 మంది విద్యార్థులు 17 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాయనున్నట్లు ఆయన మంగళవారం విలేకరులకు తెలిపారు. జిల్లా పరిధిలోని రాజంపేటలోని 5 సెంటర్లలో 1173 మంది, మదనపల్లిలోని 7 సెంటర్లలో 2051 మంది, కలికిరిలోని 5 సెంటర్లలో 1180 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా పరిశీలకుడు వి.కుమార్‌తో కలిసి పరీక్షా కేంద్రాలలోని మౌలిక వసతులను పరిశీలించామన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసివేయాలన్నారు. పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు బాల్ పాయింట్‌పెన్, పెన్సిల్ తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ వాచీలకు అనుమతి లేదన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏదైనా కారణాలతో హాల్ టికెట్ డౌన్‌లోడ్ కాకపోతే తమ దరఖాస్తు ఫారం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పరీక్ష రుసుము, టెన్త్ క్లాస్ హాల్ టికెట్‌తో ఉదయం 9 గంటల లోపు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

ముదివేడు రిజర్వాయర్ బాధితులను ఆదుకుంటాం



ముదివేడు మార్గంలో హైవే పక్కన ఆర్ అండ్ ఆర్ కాలనీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

కురబలకోట: రూ.759 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కరువు రైతుల జీవనాడి ముదివేడు రిజర్వాయర్‌కు భూములు కోల్పోతున్న నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకునేందుకు అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు చేపట్టింది. ఇప్పటికే పరిహారం నిధులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మరో వైపు వారికి పునరావాసం కల్పించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ముదివేడు ఫారెస్టు ఏరియాలో ఎంఐజీ లే అవుట్ పక్కనే 30 ఎకరాలకు పైగా ఉన్న సువిశాల స్థలంలో బాధితులకు ఆర్ అండ్ కాలనీ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించారు. మంగళవారం మదనపల్లె ఆర్డీఓ మురళి స్థానిక తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావుతో కలసి ఈ భూమిని పరిశీలించారు. ఇదిలా ఉండగా పిచ్చలవాండ్లపల్లె గ్రామ బాధిత రైతులకు రూ.45 కోట్లు, ముదివేడు గ్రామ రైతులకు రూ. 95 లక్షలు పరిహారం నిధులు విడుదల కానున్నాయని అధికారులు వెల్లడించారు. ఆర్ఐ సుగుణ పాల్గొన్నారు.

పునరావాస గ్రామస్తులకు పింఛన్ పెంపు



పెంచిన పింఛన్‌లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, సీపీఓ సుదర్శన్‌రెడ్డి

ఓబులవారిపల్లె: మంగంపేట ఏపీఎండీసీ గనుల విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఏపీఎండీసీ ఎస్ఎస్ఆర్, సీఎస్ఆర్ ద్వారా అందే పింఛన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి గతంలో రూ.750 పింఛన్ ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పింఛన్‌ను రూ.2వేలకు పెంచాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి పింఛన్ రూ.2000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. పెంచిన పింఛన్‌ను మంగళవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట నిర్వాసితులకు రూ.100 కోట్ల పరిహారం



రైల్వేకోడూరు: నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం మంగంపేటలో గ్రామాల తరలింపు, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.100 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గత 40 సంవత్సరాలుగా ఆ గ్రామప్రజలకు కలగానే మిగిలిపోయిన ఈ సమస్యను ఎట్టకేలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సమష్టి కృషితో పరిష్కరించారు. మంగంపేట డేంజర్‌జోన్‌లో ఉన్న కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల తరలింపు, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపులకు రూ.100 కోట్లు మంజూరు చేస్తూ సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు కొరముట్ల తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఎంపీ మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పొలాల పరిశీలన



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పొలాలను పరిశీలిస్తున్న రాష్ట్ర స్థాయి అధికారి చంద్రశేఖర్

చిన్నమండెం: మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పొలాలను రాష్ట్ర స్థాయి అధికారి చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. తొలుత వండాడి రైతు భరోసా కేంద్రంలో ఏపీసీఎన్ఎఫ్ కార్యకర్తల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మండలంలో కొన్ని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ ఖరీఫ్ పంట ప్రణాళిక వల్ల ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తెలిపారు. 2023–24 సంవత్సరంలో ప్రకృతి వ్యవసాయ రైతుల సంఖ్య పెంచడంపై దృష్టి సారించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం యశోదమ్మ, మండల మాస్టర్ ట్రైనర్ బీవీ నాయక్, ఐసీఆర్‌పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బడిలో చేర్పిద్దాం

- బడిఈడు పిల్లల నమోదుకు ప్రత్యేక డ్రైవ్
- రోజువారి షెడ్యూలు ప్రకటించిన విద్యాశాఖ
- వంద శాతం నమోదు కోసం ప్రణాళిక

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు

బాలురు : 85,032

బాలికలు: 85,216



6వ తరగతిలో ప్రవేశానికి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు

మదనపల్లె సిటీ: అందరికి విద్యను అందించి రాష్ట్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద తదితర పథకాలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. ఫలితంగా ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చాయి. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కోసం బృహత్తర ప్రణాళికలను విద్యాశాఖ సిద్ధం చేస్తోంది. జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థులను బడికి సన్నద్ధత చేసే దిశగా విద్యాశాఖ సోమవారం నుంచి కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రవేశాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అధికారులతో సమావేశాలు, గ్రామ సచివాలయ స్థాయి ఉద్యోగులతో కలిసి పిల్లల వివరాలు సేకరిస్తారు. తల్లిదండ్రుల కమిటీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. గత ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాబోధనతో పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయి. దీనికితోడు ఈ ఏడాది 8 వ తరగతి విద్యార్థులకు బైజూస్ తరగతుల కోసం ట్యాబ్‌ను పంపిణీ చేశారు.

ఇదీ షెడ్యూలు

ప్రవేశాలపై ఈనెల 8–12 తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సెక్టోరియల్ అధికారులతో జిల్లా అధికారులు సమావేశాలు నిర్వహిస్తారు. అనంతరం ఉపాధ్యా యులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ, వార్డు సచివాలయాల విద్య సంక్షేమ సహాయకులు, ఏఎన్ఎంలు సంయుక్తంగా పిల్లల వివరాలు సేకరిస్తారు. 15–19 వరకు ర్యాలీలు, పిల్లల జాబితాల ప్రదర్శన, తల్లిదండ్రుల కమిటీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలసి ప్రవేశాలు నిర్వహించనున్నారు. 22–26 వరకు పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, టీసీలు తీసుకున్న 1–9 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఇప్పటికే ఉన్న విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లకుండా పై తరగతికి ప్రమోట్ అయ్యేలా చూస్తారు. ఈనెల 29 నుంచి జూన్ రెండో తేదీ వరకు బడిమానేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తిస్తారు. జూన్ 5–9 వరకు ఈ కార్యాచరణ కొనసాగుతుంది. అనంతరం పాఠశాలల పునః ప్రారంభానికి సంబంధించి ఏర్పాట్లు చేయనున్నట్లు మదనపల్లె డీవైఈఓ క్రిష్టప్ప తెలిపారు.

వైవీయూ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ప్రారంభం



పరీక్షలను తనిఖీ చేస్తున్న అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందిన తొలిబ్యాచ్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో నిర్వహించిన పరీక్షలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి, లలితకళల విభాగం ఆచార్యులు డా.మూల మల్లికార్జునరెడ్డి, లలితకళల విభాగం సమన్వయకర్త డా. కోట మృత్యుంజయరావు పర్యవేక్షించారు. కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు కోర్సులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు.

ఇద్దరు యువతుల అదృశ్యం


లలిత (ఫైల్)

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువతులు అదృశ్యమయ్యారు. మదనపల్లె పట్టణానికి చెందిన మద్దిరాల అంజమ్మ కుమార్తె లలిత (22) ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు.

కుమార్తె ఆచూకీ కోసం ఫిర్యాదు


సునీత (ఫైల్)

సిద్దవటం : మండలంలోని పి.కొత్తపల్లె గ్రామానికి చెందిన సునీత (19) సోమవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ యువతి కడప నగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతోంది. సోమవారం సాయంత్రం తమకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తండ్రి సుబ్బారెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులపై కొడుకు దాడి

మదనపల్లె : తల్లిదండ్రులపై కొడుకు దాడి చేసి గాయపరచిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని చింతపల్లెకు చెందిన రాజారెడ్డి (65), శాంతమ్మ (60)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. మరో కుమారుడైన మధుకర్‌రెడ్డి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగాన్ని మూడేళ్ల క్రితం మానేశాడు. అత్తగారి ఇంటిలో ఉంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చింతపల్లెలో తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. వారిని ఇంటి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశాడు. వారు ససేమిరా అనడంతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శాంతమ్మను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి రాజారెడ్డి కుమారుడు మధుకర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు.

రైతులకు పరిహారం అందేలా చర్యలు

ఓబులవారిపల్లె : గాలివానలకు దెబ్బతిన్న అరటి పంట రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకొంటామని డీడీహెచ్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న అరటి తోటలను మంగళవారం రాష్ట్ర ఉద్యానవన శాఖ(గుంటూరు) డీడీహెచ్ శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీహెచ్ మాట్లాడుతూ రైతులు గాలులకు తట్టుకొనే నేలల్లో అరటిని సాగు చేయాలని, ఇందుకు ఎత్తు తక్కువగా పొట్టి రకం జీ9 అరటి సాగు చేయాలని సూచించారు. దెబ్బతిన్న అరటి తోట రైతుల పంట పొలాలను పరిశీలించి కమిషనర్ కార్యాలయానికి నివేదికలు పంపిస్తామని తెలిపారు. జాబితాను ఆర్బీకేలో సోషల్ ఆడిట్ కోసం డిస్‌ప్లేలో ఉంచుతామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్నారు. వైకోట, ముక్కావారిపల్లె పరిధిలో గాలులకు దెబ్బతిన్న దాదాపు 40 ఎకరాల్లో అరటి తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు ఆసియా, సురేష్, వీహెచ్ఏ దిలిప్, యశ్వంత్ రైతులు పాల్గొన్నారు.

భర్తను అడ్డు తొలగించుకునే యత్నం

- ప్రియుడితో కలిసి పథకం
- పెనిమిటిపై హత్యాయత్నం
- నిందితుల అరెస్ట్

ఎన్నో ఆశలతో అతను ఆమెను మనువాడాడు.. కానీ.. ఆమె మాత్రం అంతకుముందే మరొకరితో ప్రేమాయణంలో ఉంది.. ఈ మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చాలను కుంది. ప్రియుడితో కలిసి పథకం వేసింది. ఇద్దరూ కలిసి అమలు చేశారు. ఆమె భర్తపై ప్రియుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏమీ తెలియనట్లు ఆమె నటించింది. పోలీసుల దర్యాప్తులో ఈ దారుణం వెలుగు చూసింది. నిందితులిద్దరూ కటకటాల పాలయ్యారు.

సిద్దవటం : ఓ యువతి ప్రియుడితో కలిసి ఏకంగా భర్తపైనే హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం సాయంత్రం సిద్దవటం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి చెందిన అవ్వారు జ్ఞానేశ్వర్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మూడు నెలల కిందట కడప హనుమప్ప వీధికి చెందిన నవితతో వివాహం జరిగింది. గత నెల 19వ తేదీన శ్రీకాళహస్తి నుంచి తన భార్యను పిలుచుకొని కడపలోని అత్తగారి ఇంటి వద్దకు తీసుకొని వచ్చాడు. తిరిగి జ్ఞానేశ్వర్ శ్రీకాళహస్తికి వెళ్లాడు. అదే నెల 25వ తేదీన అత్తగారి ఇంటిలో ఉన్న తన భార్యను పిలుచుకొని వెళ్లేందుకు కడపకు వచ్చాడు. ఆరోజు రాత్రి అత్తగారి ఇంట్లోనే బస చేసి మరుసటిరోజు 26వ తేదీన ఉదయం తన భార్యను వెంటబెట్టుకొని కడప నుంచి కారులో శ్రీకాళహస్తికి బయలు దేరాడు. సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోకి రాగానే తనకు వాంతికి వస్తుందని కారు ఆపాలని భర్తతో చెప్పడంతో ఆయన కారును ఆపాడు. ఇంతలోనే అకస్మాత్తుగా కడపలోని హనుమప్ప వీధికి చెందిన జాహ్నవి కాపిష దుర్గేష్‌సింగ్ అక్కడికి వచ్చి జ్ఞానేశ్వర్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. భార్య నవిత తనకేమీ తెలియనట్లు భర్తను వైద్యం కోసం కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఈ ఘటనపై జ్ఞానేశ్వర్ గత నెల 27వ తేదీన సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ తులసీ నాగప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 10 రోజుల్లోనే హత్యాయత్నం కేసును ఛేదించారు. నవితకు వివాహం జరగక ముందే పక్కింటికి చెందిన ఎంబీఏ చదువుతున్న జాహ్నవి కాపిష దుర్గేష్ సింగ్‌తో ప్రేమలో ఉంది. నవితకు వివాహం అయినప్పటికీ భర్త జ్ఞానేశ్వర్‌తో అయిష్టంగానే కాపురం కొనసాగించింది. ఏప్రిల్ 26వ తేదీన భర్తను హతమార్చాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది. కనుమలోపల్లె గ్రామ సమీపంలో వాంతికి వస్తుందని భర్తను నమ్మించి కారును ఆపింది. భర్తపై ప్రియుడి చేత కత్తితో హత్యాయత్నం చేయించింది. ఈ విషయాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం ఉదయం 11 గంటలకు కడప నగరం ఔటర్‌రింగ్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నవిత ప్రియుడితో ఉండటంతో సమాచారం రావడంతో వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. హత్యాయత్నానికి వినియోగించిన మారణాయుధం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని సిద్దవటం కోర్టులో హాజరు పరిచారు. అనతి కాలంలోనే కేసును ఛేదించిన సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌ను, ఆయన సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ తులసీనాగప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుడితో డీఎస్పీ షరీఫ్, సీఐ, ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు


గాయపడ్డ లక్ష్మీదేవి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన లక్ష్మీదేవి (40) తన కొడుకు సురేంద్రరెడ్డి (5) కలిసి పీలేరు మండలంలోని గర్నిమిట్టలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్తూ కురబలకోట మండలం అంగళ్లకు వచ్చారు. అక్కడి నుంచి వాల్మీకిపురానికి వెళుతున్న ఓ వ్యక్తిని వారు లిఫ్ట్ అడిగి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. వాల్మీకిపురం సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయిన ద్విచక్రవాహనం నుంచి అదుపు తప్పి వారు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వాహనంలో వెనుక కూర్చుని ఉన్న లక్ష్మీదేవి కాలు విరిగి తీవ్రంగా గాయపడింది. కుమారుడు సురేంద్రరెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే ద్విచక్రవాహనం నడిపిన వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందివ్వగా ప్రథమ చికిత్స అందించి మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు సిబ్బంది ప్రమాద సమాచారాన్ని వాల్మీకిపురం పోలీసులకు తెలియజేశారు.

నిందితుల కోసం ప్రత్యేక బృందాలు

- త్వరలోనే అరెస్ట్ చేస్తాం
- జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

మదనపల్లె : యువకుడి హత్యకేసులో నిందితుల గాలింపు కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు తెలిపారు. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ చీకిలబైలు సరిహద్దు ప్రాంతమైన కూకటిమానుగడ్డ వద్ద శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కోటూరుకు చెందిన పఠాన్ అక్రమ్ (24) వెల్డింగ్ కార్మికునిగా పని చేస్తూ ఆదివారం దారుణహత్యకు గురైన విషయం విదితమే. హత్య జరిగిన సమయంలో అక్కడ ఉన్న కారు నంబరు ఆధారంగా నిందితులు కడప జిల్లా పులివెందుల వాసులుగా ప్రాథమికంగా నిర్ధారణ చేశారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, ఏఎస్పీ రాజకమల్ మంగళవారం మదనపల్లెకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై స్థానికులకు విచారణ చేశారు. అంతేకాకుండా పఠాన్ అక్రమ్‌తోపాటు ఆటోలో వెళ్లిన ఖాదర్‌వల్లీ, సుధాకర్, బషీర్, రెడ్డిబాషా, వీరేంద్రప్రసాద్‌ను తాలూకా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కారు నంబరు ఆధారంగా నిందితులను గుర్తించి వారి జాడ కోసం వెతుకుతున్నట్లు తెలిపారు. మూడు ప్రత్యేక బృందాలను గాలింపు చర్యలకై ఏర్పాటు చేశామన్నారు. ఇరువర్గాలు పెట్రోలు బంకు, చీకిలిబైలు చెక్‌పోస్టు వద్ద గొడవపడినట్లు ఆధారాలు లభించాయన్నారు. సీసీ పుటేజీలను పరిశీలించి ఆధారాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న వివరాలతో కేసు కొలిక్కి వచ్చిందన్నారు. అయితే నిందితులు సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉండటంతో టవర్ లొకేషన్ ఆధారంగా ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు చీకిలబైలు చెక్‌పోస్టును తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కర్ణాటక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. మద్యం, నిషేధిత సామగ్రి, నగదు, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. అదే విధంగా కర్ణాటక సరిహద్దు మండలాలైన రామసముద్రం, పీటీఎం, బి.కొత్తకోట మండలాల్లో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. హైవే బార్డర్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ కేశప్ప, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, ఎస్ఐ హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

యువకుడి హత్య కేసుకు సంబంధించి ఇద్దరి నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. నిందితులను రహస్య ప్రాంతంలో ఉంచి క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

వేడినీరు పడి చిన్నారికి గాయాలు

మదనపల్లె : వేడినీరు మీదపడటంతో పసిపాప తీవ్రంగా గాయపడిన సంఘటన గుర్రంకొండ మండలంలో మంగళవారం జరిగింది. చెర్లోపల్లె గ్రామానికి చెందిన రెడ్డెప్ప కుమార్తె యశ్విత (3) ఆడుకుంటూ ఉండగా పొరపాటున వేడినీరు మీద పడింది. ఈ ప్రమాదంలో చిన్నారి తీవ్రంగా గాయపడగా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

విద్యుత్ షాక్‌తో..

విద్యుత్‌షాక్‌కు గురై ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మొలకలచెరువు మండలంలో జరిగింది. దుగ్గసానిపల్లెకు చెందిన రఘురామరెడ్డి భార్య నాగలక్ష్మి (35) ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా మోటారు ఆన్ చేసి గోడలకు నీరు పడుతుండగా కరెంటుషాక్‌కు గురైంది. సంఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

టమాట రైతు కన్నెర్ర

- టమాట ధరల్లో భారీగా కోత
- వ్యాపారుల తీరుపై రైతుల ఆగ్రహం
- మార్కెట్ యార్డుకు తాళం
- జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో


గుర్రంకొండ మార్కెట్‌యార్డుకు తాళాలువేసి నిరసన తెలియజేస్తున్న రైతులు

గుర్రంకొండ : టమాట వేలం పాటల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరల్లో భారీగా కోత వేయడంతో రైతులు ఆగ్రహించారు. టమాట మార్కెట్‌యార్డుకు తాళాలు వేసి వ్యాపారుల తీరుకు నిరసనగా జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండ టమాట మార్కెట్ యార్డులో 30 మండీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంకాలం 5గంటలకు వేలం పాటలు ప్రారంభమయ్యాయి. 25కేజీల క్రీట్ ధర రూ. 70 కే వ్యాపారులు పాడుకొన్నారు. కంగుతిన్న రైతులు మదనపల్లె మార్కెట్‌లో టమట ధరలపై ఆరా తీశారు. అక్కడ 25 కేజీల క్రీట్ ధర రూ.270 వరకు పలికినట్లు తేలింది. ఇదేమిటని రైతులు వ్యాపారులను నిలదీశారు. ఇష్టముంటే తమకు విక్రయించాలని లేదంటే వేరే మార్కెట్ యార్డుకు తరలించుకుపోవాలని వ్యాపారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో ఆగ్రహించిన రైతులు మూకుమ్మడిగా మార్కెట్‌యార్డు గేట్లు మూసేసి తాళాలువేసి నినాదాలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న కడప–బెంగుళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 340)పై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకొన్న మార్కెట్‌కమిటీ చైర్మెన్ రవినాయక్, కార్యదర్శి జగదీష్, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు రైతులతో చర్చలు జరిపారు. అనంతరం వ్యాపారులను రైతుల వద్దకే పిలిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వందక్రీట్లకు 20 క్రీట్లు టమాటలను జాక్‌పాట్ పేరుతో వ్యాపారులు దోచుకొంటున్నారని ఆరోపించారు. ఇష్టానుసారం వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరల్లో భారీగా కోతలు విధిస్తున్నారని అన్నారు. కమీషన్ల పేరుతో రైతులను దోచుకొంటున్నారని, టమాట పట్టీల డబ్బులు నెలల తరబడి ఇవ్వకుండా రైతులను వేధిస్తున్నారని ఆరోపించారు. జాక్‌పాట్‌లు నిర్వహించినా, వేలం పాటల్లో కోతలు విధించినా.. రైతులను వేధించినా మండీల లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు. రైతుల షరతులకు వ్యాపారులు అంగీకరించడంతో ధర్నా విరమించారు.

టానిక్ అనుకుని పురుగుల మందు తాగి..

మదనపల్లె : ఓ మహిళ టానిక్ అనుకుని పొరపాటున పురుగుల నివారణ మందు తాగిన సంఘటన చోటుచేసుకుంది. మదనపల్లె మండలం బొమ్మనచెరువుకు చెందిన మంగమ్మ (65) అనే వృద్ధురాలికి సరిగా కళ్లు కనిపించకపోవడంతో టానిక్ అనుకుని పురుగుల నివారణ మందు తాగింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

క్రిమి సంహారణ మందు తాగి..

ఓ మహిళ క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన చోటుచేసుకుంది. మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీకి చెందిన షబ్బీర్‌ఖాన్ భార్య సోఫియా (28)పై సోమవారం రాత్రి పక్కింట్లో నివాసమున్న చాంద్‌బాషా కుటుంబీకులు దాడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన సోఫియా క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

భవన నిర్మాణ కార్మికుడు..

భవన నిర్మాణ కార్మికుడు మనస్తాపంతో ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. ఆర్.నడింపల్లెకు చెందిన వెంకటరమణ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటికి వెళుతుండటంతో భార్య రమణమ్మ మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటరమణ ఇంటిలోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వ్యక్తిపై జేసీబీతో దాడి

మదనపల్లె : ఓ వ్యక్తిని మరో వ్యక్తి జేసీబీతో గుద్ది దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన కురబలకోట మండలంలో సోమవారం రాత్రి జరిగింది. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీలోని క్రాస్ రోడ్డుకు చెందిన వెంకటరమణ (32) ఇసుక ఎత్తేందుకు కూలీకి వెళ్లాడు. కురబలకోట మండలం గోళ్లపల్లె సమీపంలో జేసీబీతో ఇసుక తీస్తుండగా పని విషయమై జేసీబీ డ్రైవర్ వెంకటేష్‌తో వివాదం ఏర్పడింది. దీంతో ఇద్దరు గొడవపడ్డారు. ఆవేశంతో వెంకటేష్ జేసీబీ తొట్టితో వెంకటరమణను ఢీకొట్టాడు. ప్రమాదంలో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. సహచర కూలీలు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రాజంపేటలో చోరీ

రాజంపేట : నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో మంగళవారం చోరీ సంఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న రామ్‌నగర్‌లోని వస్త్ర దుకాణం వ్యాపారి చెంద్రాయుడు ఇంటిలో చోరీ జరిగింది. ఏడు లక్షల నగదుతో పాటు నాలుగు తులాల బంగారు గాజులు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైయ్యారు. ఫింగర్ ప్రింట్ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ స్పెషల్‌టీంను రంగంలోకి దింపామన్నారు. చోరీ సంఘటనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని మంగంపేట జాతీయ రహదారి పక్కనే ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇనుపకడ్డీలను తొలగించి లోనికి ప్రవేశించి అమ్మవారి తాళిబొట్టు, బంగారు ఆభరణాలు దొంగలించారు. దాదాపు రూ.1.50 లక్షల విలువజేసే బంగారు నగలు చోరీకి గురయ్యాయి. గ్రామస్తుడు గునిపాటి చెన్నరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురాయి దొంగతనంపై ఫిర్యాదు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీలో 36 టన్నుల ఏ గ్రేడ్ ఖనిజం దొంగతనంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగంపేట ఏపీఎండీసీలో గతనెల ఏప్రిల్ 19వ తేదిన బెరైటీస్ ఖనిజం దొంగతనం జరిగిందని హెచ్ఆర్‌డీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ మేనేజర్ జి.నారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ప్రజా వ్యతిరేక టీడీపీ!

- ప్రజా వినతుల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ధ్వజం

సాక్షి, అమరావతి : సంతృప్తస్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు నిర్ణిత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించే ఉద్దేశంతో రూపొందించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభం నుంచే అడ్డుకోవడానికి ఈ ప్రజా వ్యతిరేక టీడీపీ ప్రయత్నాలు ప్రారంభించిందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు దుయ్యబట్టారు. మంగళవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరగకూడదు అనేదే టీడీపీ లక్ష్యమని తెలిపారు. ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ మంచి కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా .. అటు వైపు టీడీపీకి చెందిన వర్ల రామయ్య ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. టీడీపీ ఛీప్ పొలిటికల్ స్టంట్‌కి తెరలేపారన్నారు. ఈ చాదస్తం ప్రజల మధ్య ఉండే రాజకీయ నేతలకు మంచిది కాదని తెలిపారు. టీడీపీ ప్రజా వ్యతిరేక విధానాలు మరోసారి కెమెరా ముందు బట్టబయలు అయ్యాయని చెప్పారు. ప్రజలు తమ ఫిర్యాదుల పరిష్కారం కోసం వినియోగించే గ్రీవెన్స్ సెల్ పై టీడీపీ రాజకీయాలు చేయటం మానుకోవాలన్నారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్

- 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్థాజీపుర వీధిలో ఈ నెల 7న అర్ధరాత్రి సమయంలో తన అన్న షేక్ మహమ్మద్ ఇసాక్ (25)ను తమ్ముడు అబుబసర్ అలియాస్ అబ్బు ఆగ్రహావేశంతో హత్య చేశాడు. ఈ సంఘటనలో నిందితుడు షేక్ అబుబసర్ అలియాస్ అబ్బును పోలీసులు 24 గంటల్లోనే ఈ నెల 8వ తేదీ(సోమవారం) సాయంత్రం 7 గంటల సమయంలో గౌస్‌నగర్ కేసీ కెనాల్ సమీపంలో అరెస్ట్ చేశారు. అతని దగ్గరి నుంచి హత్యకు ఉపయోగించిన పిడిబాకును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మంగళవారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వివరాలు వెల్లడించారు. కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నబెస్తవీధిలో నివాసం వుంటున్న షేక్ రషీదాభానుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమారుడు, కాస్త మతిస్థిమితం సరిగాలేని షేక్ మహమ్మద్ ఇలియాస్, తన స్నేహితుడు పీరుల్లాఖాన్‌తో కలిసి అప్పుడప్పుడు మద్యం సేవించేవాడు. ఈక్రమంలోనే పండ్ల వ్యాపారి దగ్గర పని చేసి వచ్చిన తరువాత సంపాదన డబ్బుల్లో కొంత తీసుకుని ఆదివారం రాత్రి అమీన్ ఫంక్షన్ హాల్ దాటిన తరువాత సర్థాజీ పుర వీధిలో కంప చెట్లలో మద్యం సేవించి వస్తుండగా.. చిన్న తమ్ముడు షేక్ అబుబసర్ పెద్దన్నను, అతని స్నేహితుడిని చూసి ఎందుకు మీరు ఇలా తిరుగుతున్నారని వారితో వాగ్వివాదానికి దిగాడు. ఆ సమయంలో షేక్ ఇలియాస్ తన రెండవ తమ్ముడు షేక్ మహమ్మద్ ఇసాక్‌ను పిలిచాడు. ఇసాక్ వచ్చీరాగానే తన అన్న మాటలు విని.. అబుబసర్ చెంపకేసి మూడు దెబ్బలు కొట్టాడు. దీంతో అప్పటికే తన దగ్గర దాచి వుంచిన పిడిబాకుతో, ఆగ్రహావేశంతో ఊగిపోయి సొంత అన్నను నాలుగు పోట్లు పొడిచాడు. రక్తపు మడుగులో ఇసాక్ కుప్పకూలి పడిపోయి, చనిపోయాడు. తర్వాత షేక్ అబుబసర్ పిడిబాకుతో సహా పరారయ్యాడు. అతన్ని 24 గంటల్లోపే పోలీసులు సోమవారం రాత్రి గౌస్‌నగర్ కేసీ కెనాల్ సమీపంలో అరెస్ట్ చేయడంతో పాటు, అతని వద్ద నుంచి పిడిబాకును స్వాధీనం చేసుకున్నారు. పిడిబాకును అబ్బు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసుకుని తెప్పించుకున్నట్లు తెలుస్తోంది.

పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలి

పిల్లలకు యుక్తవయసు రాగానే వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా వుంచి, ఇంటికి ఎన్ని గంటలకు వస్తున్నారు, వారి నడవడిక ఎలా వుందనే విషయంపై అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎస్పీ ఎండీ షరీఫ్ సూచించారు. వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా పోలీసు శాఖ తరపున తమవంతుగా కృషి చేస్తామన్నారు. నగరంలో బైక్ రేసింగ్‌లు, వాహనాలను వేగంగా నడుపుతున్న మైనర్లపై నిఘా వుంచుతామన్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్‌ను ఇస్తామన్నారు. ఈ హత్య సంఘటనలో నిందితుడిని 24 గంటల్లోపే పట్టుకుని అరెస్ట్ చేసిన కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐలు యు.వై.జయరాములు, ఎం.ఎస్.సంజీవరాయుడు, ఏఎస్ఐ భాస్కర్, హెడ్‌కానిస్టేబుళ్లు సుధాకర్ నాయక్, తిరుపాలు, రాము, కానిస్టేబుళ్లు వి.తిరుపతయ్య, ఐ. శివకిషోర్, రఘురాముడును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్